

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక


PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 07-05-2026 | సంపుటి - 27 | సంచిక -345 | రూ : 4 | పేజీలు: 8


## మెట్రో రెండో దశకు
# సత్వరం ఆమోదం తెలపండి

- ప్రాజెక్టులో కేంద్రాన్ని భాగస్వామిగా చేర్చండి
- ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్‌సిటీ కారిడార్‌ను మూడో దశ కింద చేపట్టండి
- కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

2లో



## ఇదేనా...
# ట్రాఫిక్ ఆపే తీరు?

- ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు?
- పోలీసు అధికారులపై సీఎం ఆగ్రహం

హైదరాబాద్ :"ఇదేం ట్రాఫిక్ ఆపుడు, ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు? నా కాన్వాయ్ వెళ్తుంటే ఇంత హడావుడి అవసరమా?" అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా ఆ ప్రాంతంలోనే విపరీతమైన ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సీఎం కాన్వాయ్ వెళ్తున్న మార్గాన్ని క్లియర్ చేయడానికి ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను పోలీసులు నిలిపివేశారు. సీఎం కాన్వాయ్ వెళ్తున్న మార్గాన్ని

తరువాయి 2లో





## రైతు చేతుల్లో
# దండన తప్పదు

2లో

- పథకాల్లో కోతలు.. ఎగవేతలు తప్ప.. ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- కనీసం కల్లాల్లో పంటల్ని కూడా కొనకుండా గోస పెడుతున్నారు
- కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లో డబ్బులు.. ఇప్పుడు రాహుల్ ఖాతాలో..
- వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్


## ఈ నెలలోనే
# ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బొందపెట్టే జీవో 7
- హెచ్‌పీఎస్‌లో అవినీతి చర్యలేవీ? : కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ : విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సోమాజీ గూడ ప్రెస్‌క్లబ్‌లో నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడారు. ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి కూడా సీఎం కావడం మన ఖర్మ అని ఆమె ఆవేదన

తరువాయి 2లో



## ఐపీఎస్..
# అధికారికి షాక్

- బస్టాండ్‌లో పోకిరీల వెకిలిచేష్టలు
- మఫ్టీలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్
- కదలనివ్వకుండా చుట్టుముట్టిన ఆకతాయిలు
- వస్తావా... నీ రేటు ఎంత..? అంటూ అసభ్యకరంగా ప్రవర్తన
- 40 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విచారణ అనంతరం కౌన్సెలింగ్
- నగరవాసుల నుంచి సీపీకి వెల్లువెత్తుతున్న అభినందనలు

2లో



## మధ్యాహ్నం ప్రారంభోత్సవాలు.. సాయంత్రం సభ

- 10న హైదరాబాద్‌కు ప్రధాని మోదీ
- పరేడ్ గ్రౌండ్‌లో సభకు భాజపా భారీ ఏర్పాట్లు
- కాగజ్‌నగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, పెద్దపల్లి నుంచి ప్రత్యేక రైళ్లు

2లో

# మ్యాజిక్ ఫిగర్ కు స్వల్ప దూరం

- తమిళనాడు గవర్నర్‌తో విజయ్ భేటీ
- పూర్తి మెజార్టీ లేదుగా? : గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్
- మద్దతుకు ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రెడీ
- టీవీకే సర్కార్ ఏర్పాటుకు మరో ఆరుగురు ఎమ్మెల్యేలు అవసరం
- నేడు ప్రమాణస్వీకారం?

2లో





# రాయలసీమకు ఎన్‌ఫీల్డ్

- రూ.2,508 కోట్లతో తిరుపతిలో పరిశ్రమ
- రూ.లక్ష కోట్లతో విశాఖలో రిలయన్స్ డేటాసెంటర్
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 17వ ఎస్‌ఐపీబీ సమావేశం
- రూ.2,00,964 కోట్లతో వివిధ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం
- వాటి ద్వారా 38,722 మందికి ఉపాధి

2లో

# మెట్రో రెండో దశకు సత్వరం ఆమోదం తెలపండి

దిల్లీ: హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సత్వరం ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు. ఏడు కారిడార్లతోకూడిన రెండో దశ డీపీఆర్‌ను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, దాన్ని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం సాయంత్రం ఇక్కడ ఖట్టర్‌తో సమావేశమై ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను విస్తరించాల్సిన అత్యవసరం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. "రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 2, 3 దశల మెట్రోరైల్ ప్రాజెక్టు నిర్మాణం సజావుగా సాగాలన్న ఉద్దేశంతోనే తొలిదశ ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. దీనివల్ల 2, 3 దశల పనులు చేపట్టడం సులువవుతుంది. రెండో దశలో 129 కిలో మీటర్ల మేర మొత్తం ఏడు కారిడార్లు నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే పట్టణాభివృద్ధిశాఖకు సమర్పించాం. ఇందులో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా చేరి భారతప్రభుత్వంతెలంగాణ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంలో చేపట్టేందుకు ఆమోదం తెలపాలి.

*** భవిష్యత్తు అవసరాల కోసం మూడో దశ**

హైదరాబాద్ నగర భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ కారిడార్ వరకు మెట్రో మూడో దశ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ దశకు సంబంధించిన డీపీఆర్‌ను కూడా మేం ఇప్పటికే పట్టణాభివృద్ధిశాఖకు సమర్పించాం. అందువల్ల దాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తిచేశారు. ఈ భేటీలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, దిల్లీలో తెలంగాణభవన్ ప్రత్యేక అధికారి సంజయ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ అధికారికి షాక్

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్ నగరంలో ఆకతాయిలు మఫ్టీలో ఉన్న ఐపీఎస్ అధికారికే షాక్ ఇచ్చారు. బస్టాండ్‌లో నిల్చున్న ఆ అధికారిని ముందుకు కదలనివ్వకుండా చుట్టుముట్టారు.. వస్తావా..? నీ రేటు ఎంత..? అంటూ అసభ్యకరరీతిలో మాట్లాడుతూ పోకిరీలు రెచ్చిపోయా రు. చివరికి సుమారు 40 మంది పోకిరీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించిన అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి సుమతి కమిషనరేట్ పరిధిలో గ్రౌండ్ లెవెల్ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో ఎలాంటి సెక్యూరిటీ లేకుండా మఫ్టీలో సాధారణ మహిళలా దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో నిల్చున్నారు. ఆమె ఎవరో తెలియని కొందరు పోకిరీలు చుట్టుముట్టారు. వస్తావా నీ రేటు ఎంత..? అంటూ ఆకతాయిలు వెకిలి ప్రశ్నలతో రెచ్చిపోయారు. దాదాపు 40 మంది ఆమె వెంటపడ్డారు. ఆ సమయంలో ఎలాంటి పెట్రోలింగ్ వాహనంగానీ, గస్తీ పోలీసులుగానీ అక్కడికి రాకపోవడంతో వారు మరింత రెచ్చిపోయారు. వారిలో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు ఉండటం గమనార్హం. కొంతమంది గంజాయి, మద్యం సేవించిన వారున్నారు. అర్ధరాత్రి 12గంటల నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు పోకిరీలు హంగామా సృష్టించారు. మహిళలు ఒంటరిగా ఉంటే ఎటువంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారో స్వయంగా తెలుసుకోవడానికే పోలీస్ కమిషనర్ ఈ సాహసం చేశారు. ఉదయం మూడున్నర గంటల తర్వాత అక్కడికొచ్చిన ఒక బీట్ కానిస్టేబుల్ కమిషనర్‌ను గుర్తించారు. ఆ తర్వాత ఎస్ఐ వచ్చి సెల్యూట్ చేయడంతో ఆమె మల్కాజిగిరి సీపీగా బయటపడింది. ఈ ఆపరేషన్‌లో 40మంది పోకిరీలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారీ తప్పులు చేయకుండా హెచ్చరించారు. కాగా ఓ పోలీస్ కమిషనర్ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకోవడానికి స్వయంగా అదీ ఒంటరిగా వడు గంటలపాటు బస్టాండ్‌లో ఉండి పోకిరీల చేష్టలను పరిశీలించడంపై నగరవాసుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

# ఈ నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

హైదరాబాద్ : విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సోమాజీ గూడ ప్రెస్‌క్లబ్‌లో నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడారు. ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి కూడా సీఎం కావడం మన ఖర్మ అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఒక్క రూపాయి పెంపు లేకుండా జీవో జారీ చేయాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల్లో దాదాపు 50 నుంచి 120శాతం వరకు ఫీజులు పెంచుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా నిలిపేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్ 7 జీవోతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడే ప్ర యత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న రూ.11వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. బకాయిల కారణంగా డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయనిఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో, ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగు తున్న హెచ్‌పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిం దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఒకే వ్యక్తి గత 14 ఏళ్లుగా ఒకటే పదవిలో కొనసాగుతూ కొత్తగా వచ్చే వారికి అవినీతి పాఠాలు నేర్పుతున్నారని ఎద్దేవా చేశారు. సత్య నాదెళ్ల వంటి పూర్వ విద్యార్థులు ఇచ్చిన విరాళాలకు సం బంధించి ఎలాంటి లెక్క పత్రం లేని పరిస్థితి ఉందని విమర్శించారు. దీనికి తోడు ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన కొందరు ఏకంగా 30 ఎకరాల క్యాంపస్ భూమిని కబ్జా చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్య, వైద్యం కోసం 70శాతం ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అధికా రంలోకి వస్తే పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామ ని తెలిపారు. తాను ఇచ్చిన మాటను తప్పితే అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి రాళ్లతో కొట్టాలన్నారు.

*** ఐక్య ఉద్యమాలతోనే పరిష్కారం : అశోక్ రెడ్డి**

అందరం కలిసి పోరాడితేనే ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుఅశోక్ రెడ్డి తెలిపారు. హెచ్ఎస్పీఏ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నాణ్య మైన విద్య అందిస్తామనీ, ఫీజులను నియంత్రిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ సిఫారసు చేసిన 18శాతం నిధులు కాకుండా 6 శాతంతో కేటాయింపులతో సరిపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు స్కూల్స్‌లో ఫీజులను నియంత్రించకుండా గాలికొదిలేసిందని విమర్శించారు. సమావేశంలో సీఆర్‌పీఎఫ్ స్టేట్ కన్వీనర్ జనార్ధన్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల లక్ష్మణ్, పీడీఎస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, భాగ్య (తల్లుల సంఘం),తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సాధన వేదిక రాష్ట్ర నాయకురాలు మానస, రాంబాబు మల్లేశ్ (తెలం గాణ పేరెంట్స్ అసోసియేషన్), ఆర్. రవీంద్ర నాయక్ (ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ) మాట్లాడారు.

# ఇదేనా ట్రాఫిక్ ఆపే తీరు?

హైదరాబాద్ : "ఇదేం ట్రాఫిక్ ఆపుడు, ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు? నా కాన్వాయ్ వెళ్తుంటే ఇంత హడావుడి అవసరమా?" అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా ఆ ప్రాంతంలోనే విపరీతమైన ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సీఎం కాన్వాయ్ వెళ్తున్న మార్గాన్ని క్లియర్ చేయడానికి ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను పోలీసులు నిలిపివేశారు. సీఎం కాన్వాయ్ వెళ్తున్న మార్గాన్ని ఫ్రీగా వదిలి ఎదురుగా వస్తున్న ట్రాఫిక్‌ను కూడా ట్రాఫిక్ పోలీసులు నిలిపివేశారు. ఇది చూసి ముఖ్యమంత్రి విస్మయం చెందారు. తాను వెళ్తున్న మార్గంలో ట్రాఫిక్‌ను ఆపడం సరే, కానీ ఎదురుగా ట్రాఫిక్ వెళ్లడానికి అభ్యంతరం ఏమిటనీ ఆయన అధికారులను ప్రశ్నించారు. ఈ విధంగా తనతోపాటు ఇతర వీవీఐపీలు ప్రయాణిస్తున్నప్పుడు ఈ విధంగానే ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ నిలిపివేస్తే ప్రజలు ఇబ్బందులకు గురికారా? ఈ విషయంలో ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ ట్రాఫిక్ డైవర్షన్ ప్రక్రియను ఎందుకు చేపట్టరని ఆయన అధికారులను నిలదీశారు. ఇకపై ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కారాదు? నగరంలోనే కాదు, ఇతర పట్టణ, జిల్లాలలో కూడా ట్రాఫిక్ అధికారులు వీఐపీల పర్యటనల సందర్భంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా నియంత్రణా చర్యలను చేపట్టాలని ఆయన డీజీపీ సి.వి ఆనంద్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ రోజు శంషాబాద్ వద్ద ప్రజలను ట్రాఫిక్ ఇబ్బందులకు గురి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు.

# మ్యాజిక్ ఫిగర్ కు స్వల్ప దూరం

వీసీకే, సీపీఐ (ఎం), సీపీఐ మద్దతు కోసం కూడా విజయ్ ప్రయత్నిస్తున్నారు. టీవీకేతో పొత్తుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వీసీకే ఎంపీ రవికు మార్ చెప్పారు. విజయ్‌తో సమావేశమైన తర్వాత కాంగ్రెస్ నేత చక్రవర్తి విలేకరులతో మాట్లాడుతూ గురువారం ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని, దీనికి తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతారని చెప్పారు. తాజా పరిణామాల నేపథ్యంలో డీఎంకేతో కొనసాగుతున్న దీర్ఘకాల సంబంధాలకు కాంగ్రెస్ స్వస్తి చెప్పినట్టు కనిపిస్తోంది. టీవీకేతో పొత్తు ప్రభుత్వ ఏర్పాటుకే పరిమితం కాబోదని, స్థానిక ఎన్నికలు, లోక్‌సభ`రాజ్యసభ ఎన్నికలలోనూ కొనసాగుతుంద ని కాంగ్రెస్ తెలిపింది. తమిళనాడులో ఏర్పడబోయేది లౌకిక ప్రభుత్వమని అభివర్ణించింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు న్యూఢిల్లీలో సమావేశమై తమిళనాడులో నెలకొన్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకే అధ్యక్షుడు విజయ్ తమ మద్దతు కోరారని చెప్పారు. ఇదిలావుండగా విజయ్ కు మద్దతు కూడగట్టడం కోసం వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్‌తో కాంగ్రెస్ చర్చలు జరుపుతోందని తెలిసింది. విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చి ప్రభుత్వంలో భాగస్వామి కావాలని అన్నాడీఎంకే భావించింది. అయితే కాంగ్రెస్‌తో అవగాహనకు వచ్చిన విజయ్ ..అన్నాడీఎంకేతో చర్చలకు బ్రేక్ వేశారు. టీవీకేకు మద్దతు ఇచ్చే



విషయంలో అన్నాడీఎంకేలో అభిప్రాయబేధాలు తలెత్తాయని తెలుస్తోంది.

*** మీ దగ్గర మ్యాజిక్ నంబర్ లేదుగా: విజయ్‌తో గవర్నర్..**

తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే అధినేత విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కోరారు. అయితే విజయ్ చూపించిన సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి టీవీకేకు ఇంకా తగినంత సంఖ్యాబలం లేదని ఆయన భావిస్తున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్నే ఆయన విజయ్‌తో చర్చించినట్టు.. 118 సభ్యులు సమకూరిన అనంతరమే రావాలని సూచించినట్టు వార్తలు వస్తున్నాయి. తమిళనాడులో అసెంబ్లీ స్థానాల సంఖ్య 234 కాగా.. 108 చోట్ల గెలిచి టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే కావాల్సిన ఎమ్మెల్యేల సంఖ్య 118. కాంగ్రెస్‌కు ఐదు సీట్లతో పాటు విజయ్ గెలిచిన రెండు సీట్లలో ఒకదాన్ని మినహాయిస్తే.. సంఖ్య 112కు పెరిగింది. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి టీవీకేకు మరో ఆరుగురి మద్దతు కావాల్సి ఉంది. విజయ్ బృందంలోకి ఇంకా ఎవరెవరు వస్తారనే దానిపై స్పష్టత లేదు. దీంతో గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటకు విజయ్‌ను ఆహ్వానించలేకపోయినట్టు సమాచారం.

**మద్దతిచ్చేది లేదన్న ఆ పార్టీలు..**

విజయ్ టీవీకే పార్టీకి తాము మద్దతివ్వబోమని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), లెఫ్ట్ పార్టీలు తేల్చి చెప్పాయి. తాము డీఎంకే కూటమిలోనే ఉంటామని పేర్కొన్నాయి. మరోవైపు డీఎంకే మిత్రపక్షమైన వీసీకే.. టీవీకే పార్టీకి మద్దతిచ్చే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తమిళనాడులో సీపీఐకి 2, సీపీఎంకి 2, ఐయూఎంఎల్‌కు 2, వీసీకేకు 2 సీట్లు ఉన్నాయి.

**స్టాలిన్‌ను కలిసిన రజనీకాంత్**

మర్యాదపూర్వక భేటీయే అంటున్న డీఎంకే వర్గాలు సూపర్ స్టార్ రజనీకాంత్ డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ను కలిశారు. బుధవారం రోజు వీరిద్దరూ మర్యాదపూర్వక భేటీ అయినట్టు డీఎంకే వర్గాలు తెలిపాయి. అయితే, రాష్ట్ర ఎన్నికల్లో డీఎంకేకు ఎదురైన పరాజయం నేపథ్యంలో, రజనీకాంత్ స్టాలిన్‌కు తన సంఘీభావాన్ని తెలియజేశారని సమాచారం. స్టాలిన్‌ను భారత రాజకీయాల్లో ఒక అగ్రశ్రేణి నాయకుడిగా ఆయన కొనియాడారు.

# మధ్యాహ్నం ప్రారంభోత్సవాలు.. సాయంత్రం సభ

హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందులో జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీకి శంకుస్థాపనతోపాటు వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్‌పార్క్ సహా వివిధ ప్రాజెక్టులు ఉన్నాయి. భాజపా నిర్వహించే బహిరంగ సభలోనూ ప్రధాని పాల్గొంటారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక రాష్ట్ర పర్యటనకు రానుండటం ఇదే తొలిసారి కావడంతో తెలంగాణ కమలదళం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీ ఏర్పాట్లు చేస్తోంది.

*** హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి నుంచి అధికంగా**

పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ కోసం రాష్ట్ర భాజపా భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి అధిక జనసమీకరణ చేస్తోంది. తెలంగాణలో ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో వస్తారని.. మొత్తం 50 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండు లక్షల మంది వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు తెలిపారు. కాగజ్‌నగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, పెద్దపల్లి నుంచి వచ్చే పార్టీ శ్రేణులు, అభిమానుల కోసం నాలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటితోపాటు మూడు వేల ఆర్టీసీ బస్సులనూ బుక్‌చేసిన భాజపా.. కళాశాలలు, పాఠశాలల బస్సులనూ సభ కోసం సమీకరిస్తోంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మోదీ సభ ఏర్పాట్లు, జనసమీకరణపై పార్టీ నాయకులతో బుధవారం సమావేశమై చర్చించారు.

# రాయల్‌సీమకు ఎన్‌ఫీల్డ్

అమరావతి : బుల్లెట్ బండి ఇక రాష్ట్రం నుంచే డగ్ డగ్ మంటూ వచ్చేస్తోంది. తిరుపతిలో రూ.2,508 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ బుల్లెట్ మోటార్‌సైకిళ్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) బుధవారం అమోదం తెలిపింది. దీంతోపాటు విశాఖపట్నంలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఇంకా.. శ్రీసత్యసాయి జిల్లాలో రూ.51వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను ఆ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడప జిల్లాలో రూ.12వేల కోట్ల పెట్టుబడితో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. పలు సంస్థలకు చెందిన రూ.2,00,964.10కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) బుధవారం ఆమోదం తెలిపింది. వాటి ద్వారా 38,722 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి.

**ప్రతి ప్రతిపాదనా.. ఒప్పందంగా మారాలి**

రాష్ట్రానికి వచ్చిన ప్రతి పెట్టుబడుల ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని, ప్రతి ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎస్ఐపీబీ సమావేశంలో మాట్లాడుతూ.. 'ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా పూర్తవ్వాలి. ప్రభుత్వం నుంచి అనుమతులు ఒక్కరోజూ జాప్యం కాకూడదు. పోటీ ప్రపంచంలో పెట్టుబడులు ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ప్రత్యేకత చూపాలి. రాష్ట్రంలో అనుమతులు పొందడం ఎంత సులభతరమన్నది చాటిచెప్పాలి. రాష్ట్రానికి ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులిచ్చే స్థానాల్లో నియమించాలి' అని సీఎం సూచించారు.


**ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యం**

పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో.. ఎంఎస్ఎంఈలకూ అంతే ప్రాధాన్యం ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంలో ఎంఎస్ఎంఈలు కీలకపాత్ర పోషిస్తాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్యపంటల ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్‌పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు ఇలా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది' అని సీఎం పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వర్చువల్ విధానంలో మంత్రి కేశవ్ పాల్గొన్నారు.

# రైతు చేతుల్లో దండన తప్పదు

వరంగల్: రాహుల్‌గాంధీ సహా ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రులు రైతు డిక్లరేషన్ పేరిట 34 హామీలిచ్చి.. అమలు చేయకుండా రైతులను మోసగించారని.. కనీసం కల్లాల్లో పంటలను కొనుగోలు చేయకుండా గోస పెడుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రైతులు ఓపిక పడతారని.. ఆ ఓపిక నశిస్తే ఉరికించటం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ నాలుగేళ్ల క్రితం మే 6న వరంగల్ కేంద్రంగా రైతు డిక్లరేషన్ సభ నిర్వహించింది. ఆ సభలో ఇచ్చిన హామీలను విస్మరించిందంటూ బుధవారం ఇక్కడ 'రైతు సంగ్రామ సదస్సు' పేరిట భారాస సభ నిర్వహించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిపై, రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు అన్నదాతల చేతుల్లో దండన తప్పదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. దిల్లీకి కప్పం కడుతూ సీటును రెన్యువల్ చేసుకొనే సీఎం అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామంలో అయినా వందశాతం రుణమాఫీ అయినట్లు రైతులు చెబితే తాను దేనికైనా సిద్ధమంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లో టింగుటింగుమంటూ డబ్బు పడితే.. ఇప్పుడు ఆ డబ్బు రాహుల్ ఖాతాలో పడుతోందని ఆరోపించారు.

## వీధిలైట్ల ఏర్పాటు – అంధకారం నుంచి వెలుగుమయం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ క్లబ్ ఏరియాలో గతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వీధిలైట్లు లేకపోవడంతో ప్రాంతం అంతా అంధకారంలో మునిగిపోయింది. ఈ సమస్యపై ప్రజాస్ఫూర్తి దినపత్రికలో పలుమార్లు కథనాలు వెలువడినా అధికారులు స్పందించలేదు. తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ దృష్టికి ఈ సమస్యను స్థానికులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో చర్చించి కొత్తగా ఏర్పాటు చేసిన రెండు స్తంభాలకు వీధిలైట్లు అమర్చించారు. అలాగే మరో రెండు రోజులలో తెలంగాణ క్రీడా ప్రాంగణం వైపు కూడా వెలుగులు ప్రసరించేలా మరో వీధిలైటును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో క్లబ్ ఏరియాలో వెలుగులు నిండగా, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పోలీసులు ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలి

* **నర్సింహులపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పరిసరాలు, రికార్డులు, విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకొని, ప్రతి పోలీస్ సిబ్బంది విధి సమయాల్లో తప్పనిసరిగా స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఎప్పుడూ సులభంగా చేరుకునే విధంగా సేవలు అందించాలని సూచించారు. పెండింగ్ కేసులపై వేగవంతమైన చర్యలు తీసుకుని విచారణను నాణ్యతతో పూర్తి చేయాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. బీట్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేస్తూ గ్రామాల్లో నేర నివారణ చర్యలను బలోపేతం చేయాలని, సీసీటీవీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను శుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచడంతో పాటు మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఎస్సై బి. వెంకన్న, స్టేషన్ సిబ్బంది హాజరయ్యారు.

## హైకోర్టు తీర్పు అనంతరం బయ్యారం మండల సొసైటీ చైర్మెన్ గా మూల మధుకర్ రెడ్డి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైకోర్టు ఉత్తర్వులు అనంతరం తిరిగి భాధ్యతలు స్వీకరించిన మధుకర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన పలువురు కాంగ్రెస్ నేతలు. తెలంగాణ రాష్టం హైకోర్టు తీర్పు అనంతరం మరల బయ్యారం మండలం సొసైటి చైర్మెన్ గా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో భాధ్యతలు స్వీకరించిన మూల మధుకర్ రెడ్డిని బుధవారం సహకార సంఘం కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకంక్షలు తెలిపిన కాచనపల్లి, నామాలపాడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్షిక రాజు, బానోత్ రాంబాబు, అల్లేం కృష్ణ, బొమ్మల పాండు, రాజ్, షేక్ యూసఫ్, యల్లబోయిన జంపన్న తదితరులు పాల్గొన్నారు.


## బయ్యారం మండల సొసైటీ చైర్మెన్ గా మూల మధుకర్ రెడ్డి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైకోర్టు ఉత్తర్వులు అనంతరం తిరిగి భాధ్యతలు స్వీకరించిన మధుకర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన పలువురు కాంగ్రెస్ నేతలు. తెలంగాణ రాష్టం హైకోర్టు తీర్పు అనంతరం మరల బయ్యారం మండలం సొసైటి చైర్మెన్ గా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో భాధ్యతలు స్వీకరించిన మూల మధుకర్ రెడ్డిని బుధవారం సహకార సంఘం కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకంక్షలు తెలిపిన కాచనపల్లి, నామాలపాడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్షిక రాజు, బానోత్ రాంబాబు, అల్లేం కృష్ణ, బొమ్మల పాండు, రాజ్, షేక్ యూసఫ్, యల్లబోయిన జంపన్న తదితరులు పాల్గొన్నారు.


## గ్యాస్ ధరల భారంపై సిపిఐ ఆగ్రహం

* **ఖాళీ సిలిండర్లతో బస్టాండ్ సెంటర్‌లో వినూత్న ధర్నా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో భారీ నిరసన చేపట్టారు. ఖాళీ గ్యాస్ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్నంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. దీనివల్ల సామాన్య ప్రజలపై నిత్యావసరాల భారాలు తీవ్రంగా పెరుగుతున్నాయని ఆరోపించారు. గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, సామాన్యుడి వంటిల్లు మండుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వంగ వెంకటట్, ఎస్.కె. షహీమ్, దీటి లక్ష్మీపతి, కె. రత్నకుమారి, మునిగడప పద్మ తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ నమోదు సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి,: భారత ప్రభుత్వం ప్రతి పది సంవత్సరాలకు నిర్వహించే జనగణనలో భాగంగా 2027 ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన (హెచ్.ఎల్.ఓ ) కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ఈసారి అందుబాటులోకి వచ్చిన డిజిటల్ స్వీయ నమోదు (సెల్ఫ్ ఎనుమెరేషన్) సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ప్రజలు తమ ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం వంటి అంశాలను సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం పోర్టల్‌లోకి వెళ్లి, తమకు అనుకూలమైన భాషను ఎంపిక చేసి, మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీ సహాయం తో లాగిన్ కావాలని తెలిపారు. తదుపరి జిల్లా, పిన్ కోడ్, గ్రామం వంటి వివరాలను నమోదు చేసి, మ్యాప్‌లో తమ నివాసాన్ని గుర్తించి, ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసి సమర్పించాలన్నారు. చివరగా మొబైల్‌కు వచ్చే సెల్ఫ్ ఎనుమేరేషన్ ఐడిని భద్రపరచుకోవాలని సూచించారు. ఏప్రిల్ 26 నుండి ప్రారంభమైన ఈ స్వీయ నమోదు ప్రక్రియ ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. జనగణనలో భాగంగా ఇంటి నిర్మాణం,



వసతి సదుపాయాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, విద్యుత్, నీటి వనరులు, మరుగుదొడ్డి, వంట ఇంధనం, ఇంటర్నెట్ వినియోగం, వాహనాల వివరాలు వంటి ముఖ్య సమాచారం నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ, ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ధృవీకరిస్తారని తెలిపారు. ఆ సమయంలో తమ సెల్ఫ్ ఐడి చూపించి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్ధవంతంగా అమలు చేయవచ్చని పేర్కొంటూ, ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఈ ప్రక్రియలో పాల్గొని సరైన వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోళ్ల పై అత్యవసర సమావేశం : జిల్లా కలెక్టర్

* **తడిసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశం.**



జనగామ, ప్రజాస్ఫూర్తి, : జిల్లా లో అకాల వర్షాల నేపథ్యం లో ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అత్యవసర సమావేశం నిర్వ హించారు. తడిసిన ధాన్యాన్ని అదే రోజున కొనుగోలు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని అధి కారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్ తో కలిసి సివిల్ సప్లై, వ్యవసాయ, కో ఆపరేటివ్, రవాణా, మార్కెటింగ్, డీఆర్‌డీఏ, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం కురిసిన అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లింగ్ కు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతి కొనుగోలు కేంద్రానికి కి ఒక ట్రక్ కేటాయించామని, అవసరమైన చోట అదనపు ట్రక్కులు ఏర్పాటు చేసి ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని సూచించారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా అధికారులు ప్రతి మిల్‌పై పర్యవేక్షణ చేయా లని పేర్కొన్నారు. అకాల వర్షాల దృష్ట్యా ప్రతి కేంద్రంలో అదనపు టార్పాలిన్‌లు సిద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఏ.ఈ.ఓ లు ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగే లా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్మెట్ట, తరిగొప్పుల మండలాల రైతులకు ఉపయుక్తం గా ఉండేలా తక్షణమే ఒక మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన మక్కలను నిర్దేశించిన గోదాము ల్లో భద్రపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీఓ, డీఆర్ డీఏ ఇంచార్జ్, సివిల్ సప్లై డీఎం, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ఇంచార్జ్ అధికారులు, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బమ్మెర పోతన అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి,: జిల్లా లోని పాలకుర్తి మండలం బమ్మెర గ్రామం లో చేపడుతున్న బమ్మెర పోతన స్మారక మందిరం, కాంస్య విగ్రహం తదితర అభివృ ద్ధి పనుల పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం మినీ కాన్ఫెరెన్స్ హల్ లో టూరిజం, ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారు లతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 కోట్లతో బమ్మెర గ్రామం లో చేపడుతున్న అక్షరాభ్యాసం హాల్, బమ్మెర పోతన కాంస్య విగ్రహం, కాంపౌండ్ వాల్, బమ్మెర పోతన సమాధి, వాల్ వర్క్స్, లక్కమాంబ ట్యాంక్, ఫీల్డ్ ఛానల్, వివిధ అభివృద్ధి పనుల ను వేగవంతంగా పూర్తి చేయాల న్నారు. 7 రోజుల్లో కన్వీన్షన్ హల్, అంఫీల్ థియేటర్, ఫుడ్ కోర్ట్ కి సంబంధించిన డిజైన్ లని కన్సల్టెన్సీ ద్వారా తెప్పించుకోవాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ వారు ఆ డిజైన్ సంబంధించిన ఎస్టిమేషన్ లను పూర్తి చేయాల న్నారు. ఇరిగేషన్ శాఖ అధికారు లు లక్కమాంబ చెరువు దగ్గర మిగిలిపోయిన లైనింగ్ వర్క్స ని పూర్తి చేయాలన్నారు. ఈ అభివృద్ధి పనుల పై మళ్ళీ 15 రోజుల్లో రివ్యూ ఉంటుందని, అలాగే స్వయంగా బమ్మెర గ్రామాన్ని త్వరలో సందర్శిస్తానని అన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పాండురంగ రావు, ఇంచార్జి టూరిజం అధికారి కోదండరాములు, ఇరిగేషన్ ఈ.ఈ ప్రవీణ్, ఆర్ అండ్ బి డి.ఈ లు, ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.


## మార్కెట్ యార్డులలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

* **ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల కార్యాచరణ భాగంగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు లో రైతు వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ మార్కెట్ లో రైతు వారోత్సవాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈసారి మొక్కజొన్న వరి దిగుబడి అధికంగా వచ్చిందని రైతులకు ఇబ్బందులు లేకుండా గ్రామగ్రామాన మార్కెట్ యార్డులో కేంద్రాల్లో వేగంగా కొనుగోలు జరుగుతుందని వడగండ్ల వానపడినపుడు ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మొన్న కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులంతా ఆయిల్ ఫాం సాగు చేయాలని, నంగునూరు నర్మేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ వచ్చిందని, ఆయిల్ ఫాం సాగు చేయడం వల్ల ..రైతులకు వడగండ్ల వానలు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఉండవని మంత్రి తెలిపారు. హుస్నాబాద్ లో కూరగాయల కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని, రైతుల ప్రతి గింజ కొంటాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని ప్రభుత్వం చిత్తశుద్ధి తో ధాన్యం కొనుగోలు నిర్వహిస్తుందని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో ఒక్కో వారం ఒక్కో అంశం పై ప్రజలకు అవగాహన కల్పిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## టీవీకే పార్టీ గెలుపు పట్ల హర్షం వ్యక్తం వ్యక్తం చేసిన జి ప్యాక్ పొలిటికల్ సంస్థ




శేర్లింగంపల్లి, ప్రజాస్ఫూర్తి :తమిళనాడులో టీవీకే పార్టీ గెలుపుపట్ల మేమంతా గర్విస్తున్నామని జి ప్యాక్ పొలిటికల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమిళనాడులో టీవీకే పార్టీతో పనిచేసే గెలుపుకు కారణమైన టీవీకే సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి లోని జి ప్యాక్ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. జి ప్యాక్ కన్సల్టెంట్ ప్రవీణ్ యాలల మాట్లాడుతూ తమిళనాడులో జి ప్యాక్ సంస్థ భారీ స్థాయిలో గ్రౌండ్ వర్క్ చేసి, టీవీకే పార్టీకి మరియు విజయ్‌కు అద్భుతమైన విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. తమిళనాడులో వారసత్వ రాజకీయాలకు తావు లేకుండా, ఒక ఆర్గానిక్ లీడర్‌కు ప్రజలు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. విజయ్ రాష్ట్రవ్యాప్తంగా క్లీన్ ఇమేజ్‌తో రాజకీయాలు సాగించారని, ఎక్కడా బూతులు లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. తమిళనాడు అంతటా 500 మందికి పైగా తమ సంస్థ ప్రతినిధులు పనిచేశారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 10,000కు పైగా వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం చేరవేసి, ప్రజలను పార్టీ వైపు ఆకర్షించడంలో విజయం సాధించామని వివరించారు. ఎదుటి పార్టీలను విమర్శించకుండా, రాష్ట్ర అభివృద్ధిపై తమ దూరదృష్టిని ప్రజలకు తెలియజేయడమే తమ వ్యూహమని అన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ స్థాయిలో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వెల్లడించారు

## రైతులు ఆందోళన చెందవద్దు

**: సివిల్ సప్లై డీఎం**



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లాలో అకాల వర్షాల కారణంగా బుధవారం తడిసిన ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు తక్షణమే మిల్లులకు తరలించినట్లు సివిల్ సప్లై డీఎం హతిరామ్ తెలిపారు. మండలం చీటకోడూరు, గానుగ పహాడ్, బచ్చన్నపేట మండలం బచ్చన్నపేట, నారాయణపూర్, లింగంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి దాదాపు 1605 క్వింటాళ్ల తడిసిన ధాన్యాన్ని బాయిలర్ మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అకాల వర్షాల నేపథ్యం లో ముందస్తు చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. కొందరు అవాస్తవ ప్రచారాలతో రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా లో టోకెన్ విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేకంగా ట్రక్కులు కేటాయించి ధాన్యం తరలింపును వేగవంతం చేస్తున్నామని తెలిపారు. వ్యవ సాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నారని డీఎం వివరించారు.

## హైదరాబాద్‌లో ప్రధాని పర్యటన

**: భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష"**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం (మే 10)న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పై సీఎస్ రామకృష్ణారావు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ పర్యటన సందర్భంగా హైదరాబాద్ లోని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణలు, ఆంక్షలు అమలు చేయడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పోలీస్, ట్రాఫిక్, ఇంటెలిజెన్స్, జీహెచ్‌ఎంసీ తో పాటు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. ప్రధాని భద్రతకు సంబంధించిన 'బ్లూ బుక్' మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, పర్యటన వివరాలను గోప్యంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. హెచ్‌ఐసీసీలో జరగనున్న సమావేశ హాలును అధికారులు సందర్శించారు. ఈ సమీక్ష సమావేశంలో డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ శిబిరం సందర్శన




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గత పదకొండు రోజులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలుర), మహబూబాబాద్‌లో తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఆర్చరీ అసోసియేషన్స్, సాదుల ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ శిబిరం దిగ్విజయంగా కొనసాగుతోంది. బుధవారం ఆ శిబిరాన్ని ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పుట్ట శంకరయ్య, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు, సాదుల ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత సాదుల సారంగపాణి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆర్చరీలో పాటించాల్సిన పలు మెలకువలు, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆర్చరీ క్రీడా ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డి.ఎస్.పి. తిరుపతి రావు, శ్రీరంగం మురళి పాల్గొని, శిక్షణ పొందుతున్న ఆర్చరీ విద్యార్థినీ, విద్యార్థులకు తమ వంతు సహకారంగా ఆర్చరీ కిట్లు అందజేశారు. వారికి అసోసియేషన్, ట్రస్ట్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ శిక్షణ కోచ్‌లు కాయం లక్ష్మణ్, బత్తుల అనిల్, శిక్షణ పొందుతున్న ఆర్చరీ విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## వరకట్నం కేసు.. స్వదేశానికి చేరుకున్న ప్రయాణికుడి అరెస్టు

శంషాబాద్ (హైదరాబాద్): వరకట్న వేధింపుల కేసులో పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ఓ వ్యక్తి ఇమ్మిగ్రేషన్ అధికారులకు పట్టుబడిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం.. నిర్మల్‌కు చెందిన తాళ్లపల్లి ప్రతాప్ అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడు. వేధింపులు భరించలేక ఆమె నిర్మల్ రాణా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. సమాచారం తెలుసుకున్న ప్రతాప్.. గల్ఫ్‌కు పారిపోయాడు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ




ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఫారెస్ట్ ఏరియాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నూతన పర్కోలేషన్ ట్యాంక్ (పి టీ ) పనులను బుధవారం ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ ,ఏపీఓ రవీందర్ సందర్శించి పరిశీలించారు.భూగర్భ జలాలు పెంపొందించే లక్ష్యంతో అటవీ ప్రాంతంలో ఈ నూతన పీటీ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ...ఎండ తీవ్రత నుండి ఉపశమనం కల్పించేందుకు పని ప్రదేశంలో నీడ కోసం షామియానా ఏర్పాటు చేయాలన్నారు.పనుల నాణ్యత, కూలీల హాజరు, క్లస్టర్ల నిర్వహణను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని, కూలీలకు మంచినీరు, ప్రథమ చికిత్స కిట్ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు.నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.ఈ పీటీ నిర్మాణం పూర్తైతే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.

## యూరియా వాడకాన్ని తగ్గించు భూసారాన్ని పెంచు'

* **రైతులకు శాస్త్రవేత్తల పిలుపు**



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి రాబోవు వానాకాలం సాగుకు రైతులను సన్నద్ధం చేశారు.'యూరియా వాడకాన్ని తగ్గించు భూసారాన్ని పెంచు' అనే నినాదంతో రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త వి.లక్ష్మి నారాయణమ్మ రైతులకు పలు కీలక అంశాలపై సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు భూసార పరీక్షలు, నేల ఆరోగ్యం, సాయిల్ హెల్త్ కార్డు ఆవశ్యకత,భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగం,పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత,చౌడు నేలల యాజమాన్యం,వాతావరణ ఆధారిత పంట సాగు, అనుకూలమైన వంగడాల ఎంపిక,పంట మార్పిడి ప్రాధాన్యత, ఎరువుల వాణిజ్యం, ముఖ్యంగా నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని,అధిక యూరియా వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు వాడి భూసారం పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి 1 అంజిత్ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి లవణ్ కృష్ణ, సర్పంచ్ సుమలత,ప్యాక్స్ చైర్మన్ ఎన్.రాజన్న మరియు 40 మంది ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని విమర్శించే నైతిక హక్కు కేటీఆర్ కు లేదు

* **హుస్నాబాద్ మీడియా సమావేశంలో ప్రతిపక్షాలపై ధ్వజమెత్తిన**
* **మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బిజెపి టిఆర్ఎస్ పార్టీలో రాక్షసానందం పొందుతున్నారని ప్రజల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధిలేని ఈ రెండు పార్టీల సిద్ధాంతాలు ఒకటేనని కెసిఆర్ ను రక్షించడానికి బిజెపి ప్రయత్నం చేస్తుందని బిజెపి బీఆర్ఎస్ పార్టీలపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు బుధవారం హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి పరిస్థితిని పర్యవేక్షించడానికి అధికారులను ఆదేశించామని అకాల వర్షాలతో కొంత ఇబ్బంది ఏర్పడిన మాట వాస్తవమే తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఏమాత్రం ఇబ్బందులకు గురి కావద్దని మంత్రి అన్నారు.టిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు.10 సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసం కక్కుర్తి పడి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని. ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు అవసరమైన ప్రతి పథకాన్ని కార్యక్రమాన్ని అందించేందుకు కృషి చేస్తుందని మంత్రి అన్నారు.టిఆర్ఎస్ బిజెపి రెండు పార్టీలు కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం పై అనవసరపు రాద్ధాంతాలు చేయడం సిగ్గుచేటని ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే పార్టీలకు బుద్ధి చెప్తారని,ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రతిపక్ష పార్టీలు రాక్షసానందం పొందుతున్నారని ఘాటు విమర్శలు చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 10న రాష్ట్ర పర్యటనకు వస్తున్న సందర్భంగా స్వాగతం చెప్పడం మా బాధ్యత అని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ. మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య,మాజీ గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి,పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 16 ఏళ్ళ బాలుడు అదృశ్యం



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ఓ బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ తండాలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.... పట్లూర్ తండాకు చెందిన రాథోడ్ గౌతమ్ (16) పదో తరగతి పాస్ అయినా ఈ బాలుడు మే 05వ తేదిన ఉదయం 11గంటలకి ఇంట్లో చెప్పకుండా బయలుదేరాడు. అయితే రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు స్థానికులు సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు ఎవరికైనా సమాచారం తెలిస్తే 9398216210,6300859718 కాల్ చేయాలని కోరారు.

## వడ్లు కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతన్నలు

* **కొనుగోలు కేంద్రాలలో జాప్యం చేస్తున్నారు.**
* **రైతన్నలకు మద్దతుగా నిలిచిన బిజెపి పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలోని అరెపల్లె వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద నెల రోజుల నుంచి వడ్లు పోసి ఎండలో నిరీక్షిస్తున్నామని ఆవేదనతో అరెపల్లె రైతులు బుడగ జంగాల కాలనీ ప్రధాన రహదారిపై గంట సేపు బైఠాయించి, ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, బీజేపీ నాయకులతో కలిసి రైతుల ధర్నాకు మద్దతు తెలిపి, ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి ధర్నా దగ్గర వచ్చి, సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ తో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఫోన్ లో మాట్లిండించగా తహశీల్దార్ సానుకూలంగా స్పందించి, 2, 3 రోజుల్లో వడ్లు కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు, బీజేపీ నాయకులు ధర్నాను విరమించుకున్నారు. గంటపాటు బైపాస్ రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ వడ్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేస్తుందని, రైతులను అరిగోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాలు, తరగు పేరుతో 5 నుంచి ఆరు కిలోల తరగు తీస్తూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు . ఎలాంటి ఆంక్షలు లేకుండా వడ్లు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. అధికారులు మాత్రం కోత పెట్టడం ఏమటని ప్రశ్నించారు.ఈ ధర్నాలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ కోశాధికారి బుర్ర రాజు, నాయకులు దొంతరబోయిన సాంబరాజు, మల్లెత్తుల మహేష్, రైతులు మ్యాకాల బాలయ్య, కాశవేని వీరయ్య, సావుల మల్లేశం, గోర్ల రాజు, కల్లూరి కనుకయ్య, సావుల కనుకయ్య, పచ్చిమట్ల సత్యం, రైతులు పాల్గొన్నారు.

## వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలి

* **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని,ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అన్నారు,బుధవారం జిల్లా కలెక్టర్ గంగారం ,మహబూబాబాద్ మండలాలలో విస్తృతంగా పర్యటించారు,గంగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి,ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్, మందుల స్టాక్, సిబ్బంది హాజరు,రిజిస్టర్లను పరిసరాలను పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో స్వయంగా మాట్లాడి అందిస్తున్న వైద్య వివరాలు అడిగి తెలుసుకున్నారు, ప్రస్తుత వేసవికాలం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్, వారిగా వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని,వేసవి తీవ్రత లో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు తెలియపరచాలని, ఓ ఆర్ ఎస్,మందులు సిద్ధంగా ఉంచుకోవాలని,అవసరం ఉన్నచోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, జిల్లాలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి, మాత, శిశు మరణాలను తగ్గించాలన్నారు, లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక నిఘ పెట్టి గమనిస్తూ ఉండాలని,హిట్ వే ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అవసరమైతే తప్ప బయటికి వెళ్లకుండా చూడాలని, షెడ్యూలు ప్రకారం వైద్య సేవలను కొనసాగించాలని అన్నారు, అనంతరం మహబూబాబాద్ మండలం, అమనగల్, పర్వతగిరి గ్రామాలలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను సందర్శించారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వం సూచించిన ప్రకారం కొనుగోలు చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాలలో గన్ని సంచులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్స్, సిద్ధంగా ఉంచుకోవాలని, త్రాగునీరు, టెంట్, చైర్స్ వైద్య సేవలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు, సహకార 151, ఐకెపి 53, మెప్మా1, గిరిజన కార్పొరేషన్ 8, శాఖల ఆధ్వర్యంలో మొత్తం (213) కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందని అట్టి కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు,కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి తద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు,ఏదైనా అత్యవసర పరిస్థితులు ధాన్యం కొనుగోళ్లు,రవాణా తదితర సంబంధిత విషయాలలో సమస్యలు ఉంటే వెంటనే 7995050789 హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు,కలెక్టర్ వెంట డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఎస్ఓ రమేష్, డీఎం సివిల్ సప్లై నరసింహారావు, తహసిల్దార్లు, బాలకిషన్, రాజేశ్వరరావు, ఎంపీడీవో వైష్ణవి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## పశువుల రవాణా అడ్డుకున్న పోలీసులు: ఐదుగురు అరెస్ట్



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో నుంచి సిద్దిపేట జిల్లా కు అధిక లోడ్‌తో పశువులను తరలి స్తున్న వాహనాన్ని పట్టుకొని ఐదు గురిని అరెస్ట్ చేశారు. మంగళ వారం రాత్రి పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది, పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించారు. అక్రమంగా పశువులు (ఆవులు, ఎద్దులు) రవాణా చేస్తున్న వాహనాన్ని జిల్లా కేంద్రం లోని అర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో అదుపు లోకి తీసుకున్నారు. సీ.ఐ సత్య నారాయణ రెడ్డి వివరాల ప్రకారం, పట్టణ పరిధిలో బుధవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, జనగామ నుండి సిద్దిపేట వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఆ వాహనంలో పరిమితికి మించి 12 ఎద్దుల అధిక లోడు తో పశువులను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆ వాహనానికి ఎస్కార్ట్ గా ఒక కారు అందులో ముగ్గురు వ్యక్తులు మొత్తం ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. విచారణ లో సహిక్ అలీ, మొహమ్మద్ ఇమ్తియాజ్, మొహమ్మద్ అజీజ్, ఎం.డి నవాజ్ ఖురేషీ (నవాజ్),మొహమ్మద్ ఇస్మాయిల్ గా గుర్తించారు. వారు హైదరా బాద్ నుంచి ములుగు జిల్లా జంగాలపల్లి సంతకు వెళ్లి, అక్కడి నుంచి పశువులను అధికంగా లోడ్ చేసుకొని అక్కడ నుండి హైదరాబాద్ కబేళాకు తరలిస్తు న్నట్లు తెలిపారు. పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు సిద్దిపేట రూట్‌ను ఎంచుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు పశువు లను స్వాధీనం చేసుకుని వాటి సంరక్షణ కోసం జిల్లా లోని పెద్ద రామంచర్ల గ్రామం శ్రీ గోవింద గో సేవా సమితికి అప్పగించారు. డ్రైవర్ తో పాటు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.57,520 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను, బోలెరో వాహనం, ఎస్కార్ట్ కారు లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానంలో హాజరు పరచ గా రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

## 71 కేజీల గంజాయి స్వాధీనం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:వాహనాల తనిఖీలు చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 71 కేజీల గంజాయిని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సీఐ కరుణాకర్ ఆదేశాల మేరకు ఎస్ఐ రాకేష్ ఆధ్వర్యంలో మంగళవారం పాత కొత్తగూడెం సెంటర్‌లో వాహన తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎర్టిగా వాహనంలో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కన్పించడంతో వాహనాన్ని తనిఖీ చేయగా 71.795 కేజీల గంజాయి లభించింది. దీని విలువ రూ.35,98,750/- ఉంటుందని ఎస్సై రాకేష్ తెలిపారు. మొహమ్మద్ అజాజ్, కొలి అరుణ్, రంగాల రాజారామ్, గోగుల సతీష్ అనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్ తీసుకుని వెళ్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

## మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

* **యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మే 10న నిర్వహించబోయే కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలోని మెగా జాబ్ మేళా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం వలిగొండ మండలంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం భువనగిరి శాసన సభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుమార్తె యువ నాయకురాలు కుంభం కీర్తి రెడ్డి ఆధ్వర్యంలో వారి ఆదేశాల మేరకు వలిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరగగా, గ్రామ గ్రామానికి పోస్టర్లు పంపిణీ చేస్తూ మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎండీ మహమ్మద్ సయ్యద్ బాబా, అక్కంపల్లి ఉపసర్పంచ్ కృష్ణ, రాము, బాలు, విక్రమ్, వెంకటేష్, రవి, నాగేందర్ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటి గోడలో దాగిన తాచుపాము..

* **4 గంటల పోరాటం తర్వాత సురక్షితంగా పట్టివేత**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారుకొండ రామవరం పంచాయతీలోని మారుమూల గ్రామంలో ఓ ఇంట్లో తాచుపాము కనిపించడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. మంగళవారం అర్ధరాత్రి ఫోన్ సమాచారం అందుకున్న ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్ బాబు, సభ్యులు ఎన్. శ్రీకాంత్ (చోటు), బబ్లూ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో ఇరుకైన రెండు గోడల మధ్యలో పాము దాగి ఉండటంతో బయటకు తీయడం కష్టసాధ్యమైంది. సుమారు నాలుగు గంటల పాటు వివిధ ప్రయత్నాలు చేసినప్పటికీ పాము కనిపించకపోవడంతో చివరికి గోడను పగలగొట్టి తాచుపామును గుర్తించారు. బుసలు కొడుతూ ఉన్న (నాజా నాజా) స్పెక్టికల్ కోబ్రాను జాగ్రత్తగా పట్టుకుని సురక్షితంగా బంధించారు.

## గూడెం'లో అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ పనులు

- **అడ్డగోలు తవ్వకాలతో ప్రమాద ఘంటికలు**
- **ముందస్తు సమాచారం లేకుండా తవ్వకాలు**
- **ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు**






ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మిషన్ భగీరథ పైపులైన్ పనులు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లు ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం - విజయవాడ జాతీయ రహదారిలో ప్రధాన పైపులైన్ పనులు చేపట్టగా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోస్టాఫీస్ సెంటర్ నుంచి హెడ్డాఫీస్‌వైపు వెళ్లే దారిలో సన్యాసిబస్తీ, బర్లిఫిట్ ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న మున్సిపల్ రోడ్ల ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. అయితే మిషన్ భగీరథ పనుల కోసం సుమారు 5 నుంచి 7 అడుగుల మేరకు లోతుగా తవ్వడంతో వాహనాలు ఒకవైపు నుండి మరోవైపునకు దాటే పరిస్థితి లేదు. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం వల్ల ప్రమాదకరంగా మారింది. ద్విచకవాహనదారులు చిన్న గోతుల మధ్యలో వదిలేసిన చిన్న సందు చూసుకుని దాటే ప్రయత్నం చేస్తుండటం వల్ల ప్రమాదం పొంచిఉంది. అంతేకాక సెలవులు కావడంతో ఆయా గల్లీల్లో ఆడుకునే పిల్లలు గుంతల్లో పడిపోయే అవకాశాలు లేకపోలేదు. నిరంతరం భగీరథ పనులు చేపడుతున్న సిబ్బంది పర్యవేక్షణ ఉండకపోవడంతో స్థానికులు సైతం ఇబ్బందులు పడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

* **రాత్రివేళల్లో ప్రమాద ఘంటికలు**

జాతీయరహదారి వెంబడి తవ్వకాలు జరుపగా మట్టి మొత్తం రహదారిపై పోశారు. దానితోపాటు కాల్వల నుండి వచ్చే మురుగునీరు కూడా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇదే ప్రాంతంలో సింగరేణి సంస్థకు చెందిన ప్రధాన పైపులైన్, కిన్నెరసాని నీటి సరఫరా పైపులైన్ కూడా ఉండటంతో అవిపగిలిపోయి నీళ్లు రోడ్డుపై పారుతున్నాయి. దీంతో జాతీయరహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పగటివేళలో ఎలా ఉన్నా.. రాత్రి వేళలో ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు కాని, క్రాస్ లైన్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ రహదారి కావడంతో వేగంగా వచ్చే వాహనదారులు అకస్మాత్తుగా మట్టికుప్పలు ఉండటాన్ని చూసి సడెన్ బ్రేక్‌లు వేస్తున్నారు. ఫలితంగా మరో వాహనాన్ని ఢీకొనాల్సి వస్తోంది.

* **ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి**

మిషన్ భగీరథ పనుల వలన ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారితోపాటు చిన్నచిన్న గల్లీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, పనులు పూర్తయ్యేంత వరకు ఆయా దారులను మూసివేయాలని కోరుతున్నారు. దారులు మూసివేయకుండా పనులు చేపట్టడం వల్ల పాదచారులు, ద్విచక్రవాహనదారులు గుంతలు, మట్టికుప్పల మధ్యగుండా వెళ్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ సిబ్బందితోపాటు సంబంధిత శాఖ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ ప్రాంతాన్ని బట్టి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు స్థానికంగా నివాసం ఉండే ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# వినూత్న సమస్యతో బాధపడుతున్న కండక్టర్కు అండగా టీజీఎస్ఆర్టీసీ



అసాధారణమైన తన ఎత్తు కారణంగా విధుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ బస్ కండక్టర్కు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో అతడి సమస్యను అర్థం చేసుకుని, ప్రత్యామ్నాయ విధులను కేటాయించి పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్లోని మెహిదీపట్నం డిపోలో అమీన్ అహ్మద్ అన్సారీ బస్ కండక్టర్గా పనిచేస్తున్నారు. ఆయన ఎత్తు 6.5 అడుగులు (198 సెం.మీ.). అయితే, సాధారణంగా బస్సుల్లోని అంతర్గత ఎత్తు కేవలం 6.4 అడుగులు మాత్రమే ఉంటుంది. దీంతో బస్సులో టికెట్లు ఇచ్చేందుకు తిరిగేటప్పుడు ఆయన నిత్యం వంగి ఉండాల్సి వచ్చేది. సుమారు 10 గంటల షిఫ్ట్లో కనీసం ఐదు ట్రిప్పులు వేయాల్సి ఉండటంతో ఆయన తీవ్రమైన మెడ, నడుము నొప్పులతో బాధపడేవారు. ఈ శారీరక ఇబ్బందుల కారణంగా తనను వేరే విధులకు మార్చాలని అన్సారీ యాజమాన్యాన్ని అభ్యర్థించారు. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన యాజమాన్యం గతంలో ఏడాది పాటు తాత్కాలికంగా ఇతర విధులను కేటాయించింది. ఏప్రిల్ 28తో ఆ గడువు ముగియడంతో అన్సారీ పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారం చూపింది. అతడి సేవలను టీజీఎస్ఆర్టీసీ బస్ పాస్ విభాగంలో గానీ, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్జీఐఏ) కౌంటర్లలో గానీ అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని యాజమాన్యం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కారుణ్య నియామకం కింద 2021లో ఉద్యోగం పొందిన అన్సారీకి ఈ నిర్ణయం గొప్ప ఊరటనిచ్చింది. కండక్టర్గా పనిచేస్తూ మరణించిన తన తండ్రి స్థానంలో అన్సారీ ఉద్యోగంలో చేరారు. ఒక ఉద్యోగి ఎదుర్కొంటున్న వినూత్న సమస్యకు మానవత్వంతో స్పందించిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం: కేటీఆర్



వరంగల్: రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ నయవంచనకు పాల్పడిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు వరంగల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ''60 ఏళ్ల పాటు రైతుల రక్తం తాగిన పార్టీ కాంగ్రెస్. రైతు డిక్లరేషన్లో రైతులకు కాంగ్రెస్ నేతలు 34 హామీలు ఇచ్చారు. వాటిని నమ్మి వారు కాంగ్రెస్కు ఓటు వేశారు. అయితే.. ఆ హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు''. ''రైతు డిక్లరేషన్ అనేది బోగస్ పత్రం. మేం రైతు సంగ్రామ సభ పెడితే.. కాంగ్రెస్ నేతలు రైతు మేళా పెట్టారు. వారు పెట్టింది రైతు మేళా కాదు.. దగా మేళా. చెడ్డీ గ్యాంగ్లకంటే.. కాంగ్రెస్ గ్యాంగ్ డేంజర్. కేసీఆర్ సభ పెట్టినప్పుడు మాత్రమే రైతు బంధు డబ్బులు వేస్తున్నారు. రైతు బంధు తీసేసి.. రాహుల్ బంధు పేరు పెట్టారు. రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను రాహుల్గాంధీకి కప్పం కడుతున్నారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం. ప్రతి నెలా కప్పం కట్టి.. తన పదవిని రెన్యువల్ చేసుకుంటున్నారు. ఎ. రేవంత్రెడ్డి అంటే.. ఎగవేతల రేవంత్రెడ్డి. ఏ ఊరికైనా వెళ్దాం.. పూర్తి రుణమాఫీ జరిగిందని రైతులు చెబితే రాజీనామా చేస్తా. నా ఛాలెంజ్ను రేవంత్రెడ్డి స్వీకరిస్తారా..? మంత్రి తుమ్మల స్వీకరిస్తారా..?'' అని కేటీఆర్ సవాల్ విసిరారు.

# ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు: కవిత



హైదరాబాద్: విద్యద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాద్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ''ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవే. వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలి. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా?'' అని కవిత ప్రశ్నించారు.

# రైతుల్లో అయోమయం కలిగించేలా ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లపై రైతుల్లో అయోమయం కలిగించేలా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు, దిగుబడిపై భారత రాష్ట్ర సమితి అసత్య ప్రచారం చేస్తోందన్నారు. అసెంబ్లీ, లోక్సభ, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినప్పటికీ ఆ పార్టీ నేతలకు కనువిప్పు కలగడం లేదని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణలో దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి, కొనుగోళ్లు జరిగాయని మంత్రి చెప్పారు. ఈ రబీ సీజన్లో 67 లక్షల ఎకరాల్లో... 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చిందన్నారు.

# భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి మహా కుంభాభిషేకం

**– సతీ సమేతంగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి మండలంలోగల శ్రీశ్రీశ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహా కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఆగమ శాస్త్రానుసారంగా ఈ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీ సమేతంగా హాజరయ్యారు. మంత్రితోపాటు అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయంలో నిర్వహించిన కలశాభిషేకం, విశేష పూజలు, అర్చన కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. మహోత్సవంలో భాగంగా అగ్ని ప్రతిష్ఠతో యజ్ఞ కార్యక్రమాలు ప్రారంభమై, పుణ్యాహవాచనం, వాస్తు శాంతి, మహాసంకల్పం, విశేష హోమాలు నిర్వహించబడ్డాయి. అనంతరం కలశ స్థాపన చేసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పవిత్ర తీర్థ జలాలతో కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ గోపురం, విమానం, ధ్వజస్తంభం, గర్భగుడికి ప్రత్యేకంగా కుంభాభిషేకం జరిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం, అర్చనలు, అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించగా, పుష్పాలంకరణతో ఆలయం శోభాయమానంగా అలంకరించబడింది. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించబడగా, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం పొందారు.

**– అనంతరగిరిపై ప్రతిష్ఠాపనోత్సవం**

చంద్రుగొండ మండలం మద్దుకూరు, గుంపెన గ్రామాల పరిధిలోని ఆనందగిరి గుట్టలపై భక్తుల సహకారంతో నిర్మితమైన శ్రీశ్రీశ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ప్రతిష్ఠాపనోత్సవం వేద మంత్రోచ్చారణల నడుమ ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించబడి బుధవారంతో ముగిసింది. ఇందులో భాగంగా అగ్ని ప్రతిష్ఠ, మహాసంకల్పం, యజ్ఞాలు, విశేష హోమాలు, కలశ స్థాపన, ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీ సమేతంగా, జిల్లా కలెక్టర్ అంకిత్తో కలసి మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమం మొత్తం భక్తి భావంతో సాగగా, ఆలయ పరిసరాలు 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో మార్మోగాయి. మహోత్సవాలు ప్రశాంతంగా, ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. భక్తులకు తాగునీరు, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు సమర్థవంతంగా కల్పించబడ్డాయి. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ ట్రస్టు సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 25న క్రైస్తవుల సభ విజయవంతం చేయాలి

*** ఏఐసిఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ పాస్టర్ ఫెలోషిప్.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్తో ఈ నెల 25న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ సభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్స్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్ పాస్టర్ ఫెలోషిప్ కోరారు. బుధవారం స్థానిక గడియారం సెంటర్లోని తెలుగు బాప్టిస్ట్ చర్చ్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్య అతిథిగా ఈ సభకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. క్రైస్తవ హక్కులకై పోరాటం ప్రారంభించామని ఈ సభకు భారీ సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరాడు. దళితులకు రావలసిన దళిత హోదాను తీసివేయడం కుట్రపూరిత నిర్ణయం అన్నారు దీనిని రద్దు చేసేంతవరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐసిఎఫ్ జిల్లా కన్వీనర్ డేవిడ్ రాజు, డాక్టర్ కృష్ణ ఫర్, బిషప్ సమర్పన్ కుమార్, రెవరెండ్ కన్నా డేవిడ్, రెవరెండ్ కట్టా మోసెస్, ప్రవీణ్ కుమార్, ఫాదర్ జీవన్ కుమార్, బ్రదర్ జాకప్, శ్రీ జేమ్స్, జయప్రకాష్, పసల చౌరయ్య, ఎలీషా ఆనంద్ ప్రసాద్, బాలరాజు, బాలరాజు, ప్రకాష్, ప్రభు, చరణ్, ఎబినేజర్, జయ, చందు, మాతంగి, ఆనందమయ, యాచారం యాకోబు, మాజీ జోసెఫ, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

*** జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది" అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మార్కెటింగ్, అనుబంధ శాఖలు ఉద్యాన పట్టు పరిశ్రమ, పశు సమర్ధక శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో మూడవ రోజు రైతులకు అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగు విధానాలు మరియు ప్రభుత్వ పథకాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు సాగు పెట్టుబడి కోసం రైతు భరోసా, అకాల మరణం సంభవిస్తే కుటుంబానికి అండగా రైతు భీమా పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించడంతో పాటు సన్న బియ్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. సూర్యాపేటలో నూతనంగా భూ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా ఏ భూమిలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందో వ్యవసాయ అధికారులు సూచిస్తారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ మరియు ఖర్చు తగ్గింపులో భాగంగా నానో యూరియా వినియోగం పై రైతుల్లో అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. ఒకే రకమైన పంటలు వేయకుండా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. రైతులను నిలువునా ముంచే నకిలీ విత్తనాల విక్రయదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్, పోలీసులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అన్నారు. సూర్యాపేట మార్కెట్ లో మొక్కజొన్న పంట అమ్మకాలు చేసుకునేలా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో వరితో పాటు రైతులకు లాభసాటి తెచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ఆయిల్ ఫామ్, కూరగాయల సాగుపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతుల కోసం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం రూ.5/ లకె భోజనం ఏర్పాటు చేసిన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని కలెక్టర్ అభినందించారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తెలిపారు. సూర్యాపేట మార్కెట్లో మామిడి మార్కెట్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేస్తున్నారని త్వరలోనే పేట మార్కెట్ లో మామిడి మార్కెట్ ప్రారంభం కాబోతున్నట్లు వెల్లడించారు. సూర్యాపేటలో రూ.33 కోట్లతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను కూరగాయల రైతుల కోసం రూ.31లక్షలతో మరమ్మతులు పూర్తి చేసి త్వరలోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదిగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్, వెటర్నరీ డిడి శ్రీనివాస్, జిల్లా ఆర్టికల్చర్ అధికారి నాగయ్య, కెవికె సైంటిస్ట్ నరేష్ సెక్రెటరీ ముకురం, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉద్రిక్తత



జనగామ, ప్రజాస్ఫూర్తి: జనగామ మున్సిపాలిటీ లో బుధవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం రసవత్తరంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో 15 మంది బీఆర్ ఎస్ కౌన్సిలర్లు ఆందోళనకు దిగడంతో సమావేశం ఉద్రిక్తతకు దారితీసింది. సమావేశంలో 54 అజెండా అంశాలను కేవలం 10 నిమిషాల్లో పూర్తిచేశారని అధికారుల పై కౌన్సిలర్లు తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకు న్నారని మండిపడ్డారు. అజెండా ఆమోదంపై లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చాంబర్లో కౌన్సిలర్లు, అధికారుల మధ్య తీవ్ర వాగ్వా దం చోటుచేసుకుంది. 25వ వార్డు కౌన్సిలర్ సుగుణకర్ ఆగ్రహంతో అజెండా కాపీలను చింపివేయ డం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. కమిషనర్ సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోతున్నారని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ సభ్యులు "డౌన్ డౌన్" నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘట న స్థలానికి చేరుకుని కౌన్సిలర్లను సముదాయించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ కౌన్సిలర్లు హెచ్చరించారు.


# కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం గాజుల రామారం డివిజన్ లెనిన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో ఇప్పటికే లెనిన్ నగర్ లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో కూడా కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అందరూ ఐకమత్యంతో ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు పి. రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్. సాయిలు, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, తారా సింగ్, బోయిని మహేష్, శివ నాయక్, శ్రావణ్, కాలనీ వాసులు జీవి శ్రీనివాస్ యాదవ్, సాంబరాజు, ప్రవీణ్ చారి, శివ నాయక్, భాస్కర్, తౌర్యా నాయక్, సీ.హెచ్.ప్రసాద్, ఉప్పల రవి, రవీందర్ రెడ్డి, ప్రసాద్, రాధాకృష్ణ, ఆదినారాయణ, గోపి, శ్రీనివాస్ యాదవ్, సత్యం, సాయి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, మహిళా సభ్యులు, దుర్గ, పద్మ, రత్న, భాగ్య తదితరులు పాల్గొన్నారు.


# నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని, ఇందులో 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్ రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్టాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# ఆఖర్లో దూసుకెళ్లిన సూచీలు..

## 24,300 పైకి నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెరించేలా అమెరికా, ఇరాన్ దేశాలు ఒక ఒప్పందానికి చేరువయ్యాయన్న వార్తలు మార్కెట్‌లో ఉత్సాహానికి కారణమయ్యాయి. ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ కూడా దాదాపు 9 శాతం క్షీణించి 100 డాలర్లకు చేరువ అవ్వడం మరింత కలిసొచ్చింది. దీంతో ఉదయం లాభనష్టాల మధ్య కదలాడిన సూచీలు.. చివరి గంటలో దూసుకెళ్లాయి. మదుపర్ల సంపద సుమారు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 77,424.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,017.79) లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి దాదాపు 800 పాయింట్లు క్షీణించింది. అమెరికా- ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన వార్తలు రావడంతో సూచీ పుంజుకొంది. చివరికి 940.73 పాయింట్ల లాభంతో 77,958.52 వద్ద ముగిసింది. నిఫ్టీ 298.15 పాయింట్ల లాభంతో 24,330.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలపడి 94.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో ఏకంగా 6 శాతం మేర దూసుకెళ్లింది. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద ట్రేడవుతండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# ప్రీమియం ప్లాన్‌ల కోసం

## జియో, ఎయిర్‌టెల్ 'స్లైసింగ్' వ్యూహం!



**న్యూఢిల్లీ:** దేశంలో ప్రముఖ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్ ప్రీమియం ప్లాన్‌లను తీసుకొచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇందుకోసం టెలికాం నియంత్రణ సంస్థ నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. జియో ఇప్పటికే ఈతరహా ప్రయత్నాలు మొదలుపెట్టగా.. తాజాగా ఎయిర్‌టెల్ కూడా అదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం నెట్‌వర్క్ 'స్లైసింగ్' సాంకేతికతను వినియోగించడానికి సిద్ధమవుతోంది. ఇంతకీ ఏమిటీ సాంకేతికత? భారత్‌లో దీనికున్న అడ్డంకులేంటి?

ప్రస్తుతం టెలికాం కంపెనీలు 4జీ ధరలకే 5జీ సేవలను అందిస్తున్నాయి. దీంతో ఆశించిన ఆదాయం రావడం లేదనేది కంపెనీల వాదన. 5జీ స్పెక్ట్రమ్ కొనుగోలు, ఆ మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసిన ఖర్చును తిరిగి రాబట్టాలంటే.. ప్రీమియం సర్వీసులు అందించడం ఒక్కటే మార్గమని టెల్కోలు భావిస్తున్నాయి. ఇందులోభాగంగా ఎయిర్‌టెల్ తన ఆదాయాన్ని పెంచుకునేందుకు 'నెట్‌వర్క్ స్లైసింగ్' సాంకేతికతను ఉపయోగించి ప్రీమియం ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

### ఏమిటీ నెట్‌వర్క్ స్లైసింగ్?

ఒకే ఫిజికల్ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలపై బహుళ వర్చువల్ నెట్‌వర్క్‌లను సృష్టించడం ఈ సాంకేతికత ఉద్దేశం. ఒక్కో 'స్లైస్' ఒక్కో నిర్దిష్ట అవసరానికి తగ్గట్టుగా పనిచేస్తుంది. ఉదాహరణకు హై-స్పీడ్ గేమింగ్ కావాలనుకునే వారికి ఒక స్లైస్, వీడియో స్ట్రీమింగ్ కోసం ఒకటి.. ఎంటర్‌ప్రైజ్ అవసరాల కోసం మరొకటి అన్నమాట. అంటే మీరు హైస్పీడ్ డేటా వేగంతో గేమింగ్ ఆడాలనుకుంటే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నమాట. ఇలా 5జీ నెట్‌వర్క్‌ను నిర్దిష్ట కస్టమర్ల అవసరాలను తీర్చడానికి వినియోగించొచ్చు. ఇప్పటికే రిలయన్స్ జియో 5జీ నెట్‌వర్క్ ఆధారిత ప్రీమియం సర్వీసులను తీసుకొచ్చేందుకు ట్రయల్స్ మొదలుపెట్టింది. క్లౌడ్ గేమింగ్ కోసం ప్రత్యేక ప్లాన్ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇదే మాదిరిగా ఎయిర్‌టెల్ కూడా ఇందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తోంది. మెరుగైన వేగం, తక్కువ లేటెన్సీ కోరుకునే వారి కోసం ప్రీమియం ధరలతో ప్రత్యేక ప్లాన్‌లు అందించాలని చూస్తోంది. దీనివల్ల టెల్కోల ఆదాయం 20-30 శాతం పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# మహీంద్రా అండ్ మహీంద్రా

## లాభం రూ.5,260 కోట్లు



**న్యూఢిల్లీ:** వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, మార్చి త్రైమాసికంలో రూ.5,259.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,541.85 కోట్లతో పోలిస్తే ఇది 48.5% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.39,113.61 కోట్ల నుంచి రూ.49,615.48 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ లాభం రూ.18,621.71 కోట్లుగా నమోదైంది. 2024-25 లాభం రూ.14,073.17 కోట్ల కంటే ఇది 32.32% అధికం. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,58,749.75 కోట్ల నుంచి రూ.1,97,792.78 కోట్లకు చేరింది. రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.33 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

విభాగాల వారీగా: మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు 21% పెరిగి 3.07 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2025-26లో ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ట్రాక్టర్ల విభాగంలో కంపెనీ మార్కెట్ వాటా 43.6 శాతానికి పెరిగింది. 2025-26లో 5 లక్షలకు పైగా ట్రాక్టర్ల బిల్లింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించింది.

భవిష్యత్తు అంచనాలు, ప్రణాళికలు: 2031 నాటికి 10 కొత్త ఐసీఈ ఎస్‌యూవీలు, 6 కొత్త విద్యుత్తు వాహనాలను తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాదిలో ట్రాక్టర్ పరిశ్రమ స్వల్ప వృద్ధి నమోదు చేయొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచడం ద్వారా అన్ని వ్యాపార విభాగాలను ఆధునికీకరించాలని కంపెనీ యోచిస్తోంది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎం అండ్ ఎం షేరు 3.41% లాభంతో రూ.3,211.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,168.98 కోట్లు పెరిగి రూ.3.99 లక్షల కోట్లకు చేరింది.

# పంజాబ్‌పై హైదరాబాద్ ఘన విజయం..

- పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి సన్‌రైజర్స్
- 20 ఓవర్లలో 235 పరుగులు చేసిన హైదరాబాద్
- భారీ లక్ష్యంతో బరిలోకి దిగి 202 పరుగులకే కుప్పకూలిన పంజాబ్
- 107 పరుగులతో రాణించిన కూపర్ కానెల్లీ






**హైదరాబాద్:** ఐపీఎల్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యాన్ని ఛేదించే ప్రదర్శన కనబరచలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది.

పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూపర్ కానెల్లి ఒంటరి పోరాటం చేశాడు. 59 బంతుల్లోనే 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ జట్టులో మిగిలిన ఆటగాళ్లు ఎవరూ రాణించలేదు. ఈ గెలుపుతో హైదరాబాద్ పాయింట్ల పట్టికలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. 11 మ్యాచ్‌లకు గాను 7 మ్యాచ్‌లు గెలిచి 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి పడిపోయింది.

# ఐపీఎల్ 2026 ఫైనల్ అహ్మదాబాద్‌లో..



### రెండు వేదికల్లో ప్లేఆఫ్ మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** ఈ యేటి ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ప్లే ఆఫ్ గేమ్స్‌కు చెందిన వేదికల వివరాలను కూడా ఇవాళ బీసీసీఐ రిలీజ్ చేసింది. మే 31వ తేదీన .. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు. ఇక క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను ధర్మశాలలో, మరో రెండు ప్లేఆఫ్ మ్యాచ్‌లను న్యూ చండీఘడ్‌లో నిర్వహించనున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. 2022, 2023 సీజన్లకు చెందిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరిగిన విషయం తెలిసిందే. క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను మే 26వ తేదీన నిర్వహించనున్నారు. లీగ్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ మ్యాచ్‌ను ఆడనున్నాయి. ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇక మే 27వ తేదీన మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. న్యూ చండీఘడ్‌లోని కొత్త స్టేడియంలో మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇక ఇదే వేదికపై మే 29వ తేదీన క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను నిర్వహిస్తారు.

# వీఐపీ టికెట్ల రగడ..

- బెంగళూరులో ఫైనల్ నిర్వహణపై బీసీసీఐ పునరాలోచన
- ఐపీఎల్ 2026 ఫైనల్ వేదికపై సందిగ్ధత
- ఎమ్మెల్యేల ఉచిత టికెట్ల వివాదంతో బెంగళూరుకు గండం
- సమస్య పరిష్కరించకపోతే వేదిక మార్పు తప్పదని బీసీసీఐ హెచ్చరిక
- డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్సీబీకి దక్కాల్సిన ఆతిథ్యం



**బెంగళూరు:** ఐపీఎల్ 2026 సీజన్ తుది అంకానికి చేరుకుంటున్న వేళ, ఫైనల్ మ్యాచ్ వేదికపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. కర్ణాటకలో ఎమ్మెల్యేలకు ఉచిత టికెట్ల కేటాయింపుపై చెలరేగిన వివాదం కారణంగా, ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి మరో నగరానికి తరలించే యోచనలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉన్నట్లు తెలుస్తోంది.

ఐపీఎల్ నిబంధనల ప్రకారం, గత సీజన్ విజేత హోమ్‌గ్రౌండ్‌లోనే ఫైనల్ నిర్వహించడం ఆనవాయితీ. ఈ లెక్కన డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సొంతగడ్డ అయిన చిన్నస్వామి స్టేడియంలోనే ఫైనల్ జరగాల్సి ఉంది. అయితే, "మేము ప్రజాప్రతినిధులం, వీఐపీలం, క్యూలో నిల్చోలేం" అంటూ కొందరు ఎమ్మెల్యేలు ఉచిత టికెట్ల కోసం డిమాండ్ చేయడం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

ఈ వివాదంపై కర్ణాటక ప్రభుత్వం స్పందించి, ప్రతి ఎమ్మెల్యేకు మూడు టికెట్లు కేటాయిస్తామని సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ, ఈ రాజకీయ రగడ ఫైనల్ వంటి మెగా ఈవెంట్ నిర్వహణకు ఆటంకం కలిగించవచ్చని బీసీసీఐ భావిస్తోంది. "టికెట్ల సమస్యకు పరిష్కారం లభించకపోతే, ఫైనల్ వేదికను మరో నగరానికి తరలిస్తాం" అని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్లేఆఫ్ మ్యాచ్‌లను పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఫైనల్ వేదికపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రస్తుతం లీగ్ దశలో పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ 12 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫైనల్ వేదికపై బీసీసీఐ అధికారిక ప్రకటన కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో ఉత్కంఠ...

- రసవత్తరంగా మారిన ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు
- పాయింట్ల పట్టికలో టాప్-4లో పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్
- రేసులోకి బలంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్
- ఢిల్లీ, కోల్‌కతా, ముంబై జట్లకు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'
- అనేక జట్ల భవిష్యత్తును నిర్ధారించనున్న నెట్ రన్ రేట్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఊహించని మలుపులతో అత్యంత రసవత్తరంగా మారింది. లీగ్ దశ ముగింపునకు వస్తున్నా, ఏ జట్టుకూ ఇంకా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు కాలేదు. గణాంకాల ప్రకారం ఇంకా ఏ జట్టూ అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించకపోవడంతో రాబోయే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగనుంది. ముఖ్యంగా పాయింట్ల పట్టికలో జట్ల మధ్య స్వల్ప తేడాలు మాత్రమే ఉండటంతో నెట్ రన్ రేట్ కీలకంగా మారనుంది.

### అగ్రస్థానంలో పంజాబ్, బెంగళూరు

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్లు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, బెంగళూరు 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లూ మెరుగైన నెట్ రన్ రేట్‌ను కలిగి ఉండటం వారికి కలిసొచ్చే అంశం. పంజాబ్ తన మిగిలిన 5 మ్యాచ్‌లలో 2 గెలిస్తే సులభంగా అర్హత సాధిస్తుంది. ఇక, ఆర్సీబీ (o1.420)కి ఉన్న భారీ నెట్ రన్ రేట్ వారి ప్రధాన బలం. వారు 2-3 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం.



### మధ్యలో తీవ్ర పోటీ.. పుంజుకున్న చెన్నై

సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), గుజరాత్ టైటాన్స్ (జీటీ) జట్లు కూడా 12 పాయింట్లతో టాప్ జట్లకు గట్టి పోటీ ఇస్తున్నాయి. అయితే, ఈ మూడు జట్లు పంజాబ్, బెంగళూరు కంటే ఒక మ్యాచ్ అదనంగా ఆడాయి. హైదరాబాద్, రాజస్థాన్ పాజిటివ్ రన్ రేట్‌తో మెరుగైన స్థితిలో ఉండగా, గుజరాత్ టైటాన్స్ నెగటివ్ రన్ రేట్‌తో (-0.147) ఇబ్బంది పడుతోంది. జీటీ ప్లేఆఫ్స్ చేరాలంటే రాబోయే మ్యాచ్‌లలో భారీ విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

మరోవైపు, సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చివరి నాలుగు మ్యాచ్‌లలో మూడు గెలిచి రేసులోకి బలంగా పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఈ జట్టు, మిగిలిన 4 మ్యాచ్‌లలో కనీసం 3 గెలవడం ద్వారా 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. సీఎస్‌కేకి ఉన్న పాజిటివ్ నెట్ రన్ రేట్ (o0.151) చివరి దశలో వారికి ఉపయోగపడవచ్చు.

### ఇకపై ప్రతి మ్యాచ్ కీలకమే

ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల పరిస్థితి క్లిష్టంగా మారింది. ఢిల్లీకి ఇకపై ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీస్తుం ది. మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిస్తేనే వారికి అవకాశం ఉంటుం ది. కోల్‌కతా, ముంబయి జట్లు కూడా దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని కోరుకోవాలి. ఈ మూడు జట్లకు వారి నెగటివ్ నెట్ రన్ రేట్ పెద్ద అవరోధంగా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) అద్భుతంగా రాణించి మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిచినా, వారి అత్యంత దారుణమైన నెట్ రన్ రేట్ (-1.076) కారణంగా ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యం. మొత్తం మీద రాబోయే రెండు వారాలు అభిమానులకు అసలైన టీ20 మజాను పంచనున్నాయి. ప్రతి పరుగు, ప్రతి వికెట్ పాయింట్ల పట్టికను, జట్ల భవిష్యత్తును మార్చే అవకాశం ఉండటంతో ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగడం ఖాయం.

## సల్మాన్ మూవీలో విలన్‌గా
# అక్షయ్ ఖన్నా ?



**టాకీస్:** బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా తీయనున్న విషయం తెలిసిందే. ఎస్‌వి సి63' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ కండల వీరుడితో ఢీ కొట్టేందుకు విలన్ పాత్ర కోసం ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఏమాత్రం తగ్గకుండా నటనలో ఆయనకు గట్టి పోటీ ఇచ్చే విలన్ ఉండాలని చిత్ర బృందం భావిస్తోందట. అందుకే ఈ ఇద్దరిలో ఒకరిని ఫైనల్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబయిలో దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నయనతార కూడా ఈ తాజా షెడ్యూల్‌లో పాల్గొన్నారు. సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్‌కు వంశీ పైడిపల్లి స్టైలిష్ టేకింగ్ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.



# ఎల్లమ్మ మూవీలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్

**టాకీస్:** 'బలగం' వంటి హృదయాన్ని తాకే ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి తన రెండో సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతు న్నారు. 'ఎల్లమ్మ' అనే ప్రత్యేకమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు ఇప్పుడు తెరపడుతున్నట్లు సమాచారం.తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో నటనకు అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం దర్శకుడు చాలా జాగ్రత్తగా హీరోయిన్‌ను ఎంపిక చేయాలని భావించారు. ప్రారంభంలో ఈ పాత్ర కోసం సాయి పల్లవిను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించింది. ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. వీరితో పాటు శృతి హాసన్, భాగ్యశ్రీ బోర్సే, కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతా రామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఫైనల్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే మృణాల్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఇక ఈ చిత్రంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఫేమస్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా రూపొందుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. హీరోయిన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## MOVIE TIME

### నితిన్ కొత్త సినిమా పూజా
## కార్యక్రమంతో ప్రారంభం



**టాకీస్:** యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై రూపొందుతున్న తాజా చిత్రం నేడు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సినిమా ద్వారా సోము నర్రి దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతుండగా, 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ నితిన్ సరసన కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇతర పనులు పూర్తి చేసుకుని, మే రెండో వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న సితార సంస్థ ఈ సినిమాతో నితిన్‌కు ఒక భారీ కమర్షియల్ సక్సెస్‌ను అందించేందుకు సిద్ధమైంది. త్వరలోనే ఈ చిత్ర టైటిల్ మరియు పూర్తి నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

# 600 కోట్ల భారీ బడ్జెట్‌తో రజనీ, కమల్ మూవీ

**టాకీస్:** దక్షిణాదిలో మాత్రమే కాకుండా మొత్తం భారతీయ సినీ పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిన భారీ ప్రాజెక్ట్ ఏదైనా ఉందంటే అది సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటించబోతున్న మల్టీస్టారర్ సినిమా. ఈ చిత్రాన్ని ప్రతిభావంతుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొనగా, తాజాగా వినిపిస్తున్న వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. సినీ వర్గాల్లో ప్రచారం ప్రకారం ఈ సినిమాకు సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్ కేటాయించినట్టు సమాచారం. ఇది నిజమైతే భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలిచే అవకాశముంది. ఈ భారీ వ్యయంలో ఎక్కువ భాగం ప్రధాన నటులు మరియు సాంకేతిక బృందం పారితోషికాలకే వెళ్తున్నట్టు తెలుస్తోంది.ముఖ్యంగా రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు ఒకే సినిమాలో నటించడం వల్ల వారి పారితోషికాలు కూడా అత్యంత భారీగా ఉన్నాయని సమాచారం. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కూడా తన విజయాల నేపథ్యంలో మంచి మొత్తాన్ని అందుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నది ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ రవిచందర్ కాగా, ఆయన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన బలం కానుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను కమల్ హాసన్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ నిర్మిస్తోంది. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ప్రస్తుతం ముందస్తు పనులు వేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. ఇంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ మల్టీస్టారర్‌ను దర్శకుడు నెల్సన్ ఎలా రూపొందిస్తాడో అన్నది ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మొత్తానికి రజినీకాంత్ , కమల్ హాసన్ కలయిక, నెల్సన్ దర్శకత్వం, అనిరుధ్ సంగీతం కలిసివచ్చి ఈ సినిమాను భారతీయ సినీ రంగంలో ఒక కొత్త మైలురాయిగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# లెనిన్ మూవీలో భాగ్యశ్రీ లుక్ విడుదల



**టాకీస్:** 'లెనిన్'లో అఖిల్‌తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్‌లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్‌తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్‌ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్' చిత్రం రూపుదిద్దుకొంటోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.